క్లుప్తంగా

ఎమ్మెల్సీ ఎన్నికలకు సర్వం సిద్ధం

తాడేపల్లిరూరల్ : తాడేపల్లి మండల, రూరల్ పరిధిలోని ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఏర్పాట్లను తహసీల్దార్ సీతారామయ్య, కార్పొరేషన్ అధికారులు మంగళవారం చేశారు. తహసీల్దార్ మాట్లాడుతూ తాడేపల్లి పట్టణ, రూరల్ పరిధిలో ఎమ్మెల్సీ ఓట్లకు సంబంధించి తాడేపల్లి క్రిస్టియన్‌పేట, పోలకంపాడు స్కూల్, ఉండవల్లి ప్రభుత్వ పాఠశాలలో పోలింగ్ స్టేషన్‌లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మొత్తం 8 బూత్‌లుల్లో పట్టభద్రుల ఓటర్లు 5,519 మంది ఓటు హక్కు వినియోగించుకునే విధంగా ఏర్పాట్లు పూర్తి చేశామని చెప్పారు. బారికేడ్ల నుంచి వచ్చే వారికి మంచినీటి సౌకర్యం, దివ్యాంగులకు వీల్‌చైర్స్ సౌకర్యం కల్పించామన్నారు.

ప్రభుత్వం కార్మికులతో చర్చలు జరపాలి

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురం ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులతో ప్రభుత్వం చర్చలు జరిపి, వారికి న్యాయం చేయాలని సీఐటీయూ తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు కోరారు. మంగళవారం కార్మికులు నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్ష శిబిరాన్ని యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్‌తో కలసి ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ చట్ట ప్రకారం తమకు న్యాయంగా రావాల్సిన బకాయిల కోసం కార్మికులు దీక్షలు చేస్తున్నారన్నారు. కార్మికుల శ్రమతో నేడు వేల కోట్ల రూపాయలు విలువ చేసే భూమి యాజమాన్యానికి దక్కిన విషయాన్ని గుర్తుచేశారు. కార్మికులు 170 మంది అర్ధాకలితే మృతి చెందారని, అయినా యాజమాన్యం మనసు కరగడం లేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఆరిఫ్, ఆశీర్వాదం, అంకయ్య, ఇస్మాయిల్, రమాదేవి, దర్శి మాణిక్యరావు, సల్మాన్, సుబ్బారావు, దుర్గాభవాని పాల్గొన్నారు.

అక్రమ రిజిస్ట్రేషన్ వ్యవహారం కలకలం

తాడికొండ: తుళ్లూరులో నకిలీ సర్టిఫికెట్లతో అక్రమ రిజిస్ట్రేషన్ చేసిన వ్యవహారంపై సాక్షిలో 'అక్రమ రిజిస్ట్రేషన్‌పై ఆందోళన' పేరుతో మంగళవారం కథనం ప్రచురితమైంది. బాధితులు తుళ్లూరు పోలీస్‌స్టేషన్‌లో దీనిపై ఫిర్యాదు చేసిన నేపథ్యంలో నిందితులు అప్రమత్తమయ్యారు. రిజిస్ట్రేషన్ కోసం ఎన్‌వోసీ జారీ చేసిన కార్యదర్శితో పాటు సబ్ రిజిస్ట్రార్, డాక్యుమెంట్ రైటర్‌లు రంగంలోకి దిగి రిజిస్ట్రేషన్ రద్దు చేసుకునేలా పావులు కదుపుతున్నారు. ఈ వ్యవహారానికి మధ్యవర్తిగా ఓ టీడీపీ నాయకుడు వ్యవహరిస్తున్నారు. తమపై కేసు నమోదు కాకుండా చూడాలని మరో వర్గానికి చెందిన టీడీపీ నాయకులను సంప్రదిస్తున్నారు. అయితే తమకు చెందిన ఆస్తిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసిన వ్యవహారంలో బాధ్యులపై చర్యలు తీసుకుని, తమకు న్యాయం చేయాలని బాధితులు డిమాండ్ చేస్తున్నారు.

టైలర్స్ డేను జయప్రదం చేయండి

మంగళగిరి టౌన్ : ఈ నెల 28న జరిగే టైలర్స్ డే వేడుకలను జయప్రదం చేయాలని అసోసియేషన్ సభ్యులు కోరారు. మంగళగిరి నగర పరిధిలోని పూల మార్కెట్ సెంటర్‌లో ఉన్న అమరావతి టైలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయంలో మంగళవారం అసోసియేషన్ సమావేశం నిర్వహించారు. అసోసియేషన్ రిజిస్ట్రేషన్ పూర్తిచేసుకోవడంతో నియమ నిబంధనల బ్రోచర్‌ను ఆవిష్కరించారు. అసోసియేషన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు షేక్ నాగుల మీరా, వెంకట సాంబశివరావు, కోశాధికారి భాస్కర్, సభ్యులు సుబ్రహ్మణ్యం, భావన్నారాయణ, రజాక్ పాల్గొన్నారు.

భక్తుల పుణ్యధరి.. కైలాసగిరి

- ప్రసిద్ధ శైవక్షేత్రం పేరేచర్ల కైలాసగిరి
- అడుగు పెడితే ప్రకృతి సోయగం, ఆధ్యాత్మిక చింతన
- శివరాత్రి పర్వదినానికి ఏర్పాట్లు పూర్తి


కైలాసగిరిపై వెలసిన శివాలయం

మేడికొండూరు: ప్రకృతి సోయగం, చుట్టూ నింగిని తాకే కొండలు, పక్షుల కిలకిల రావాల మధ్య ప్రసిద్ధ శైవక్షేత్రంగా బాసిల్లుతోంది కైలాసగిరి పుణ్య క్షేత్రం. స్థానిక పేరేచర్ల సమీపంలో కొలువై ఉంది ఈ ఆలయం. కైలాసగిరి నుంచి శివుడు ఇక్కడికి వచ్చి కొలువయ్యాడని భక్తుల కథనం. గుంటూరుకు పది కిలోమీటర్ల దూరంలో ఉంది ఈ మహిమాన్విత శైవక్షేత్రానికి శివరాత్రి స్వామి దర్శనం కోసం లక్షకు పైగానే భక్తులు వస్తారు.

ప్రాశస్త్యం..
తెనాలికి చెందిన కారుమూరి వీర రాఘవయ్య గుప్తా అనే వ్యక్తికి 52 ఏళ్ల క్రితం శివుడు కలలో కనిపించి కైలాస గిరి ప్రాంతంలో ఆలయం నిర్మించమని చెప్పాడని ప్రచారం. అదే తడవుగా ఆయన ఆలయం నిర్మించాడని ప్రస్తుతం ఉన్న పూజారులు చెబుతారు. మహిమ గల శివలింగాన్ని ప్రతిష్ఠింపజేశారు. స్వామిని దర్శించుకుని, కోరిన కోర్కెలు తీరతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. ఆలయంలో ప్రతి రోజూ వందలాది మంది భక్తులకు నిత్యాన్నదానం జరుగుతుంది. సోమవారం, కార్తిక మాసంలో భక్తుల తాకిడి అధికంగా ఉంటుంది. శివరాత్రి పర్వదినాన జిల్లా నలు మూలల నుంచి భక్తులు లక్షల సంఖ్యలో కొండకు పోటెత్తుతారు.

ఆధ్యాత్మిక చింతన
అరవై రెండు ఏకరాల్లో పచ్చని పొలాల మధ్య ఉన్న ఈ శైవక్షేత్రంలో అడుగు పెడితే భక్తులకు ఏంతో ప్రశాంతత లభిస్తుంది. చుట్టూ కొండలు, పచ్చని ప్రకృతి మధ్య అధ్యాత్మిక చింతన కలుగుతుంది. భక్తులు ఆలయంలో పూజలనంతరం ప్రకృతిని ఆస్వాదిస్తారు. ఆలయంలో శివునికి పక్కనే పార్వతీ దేవి, కన్యకాపరమేశ్వరి అమ్మవార్లు భక్తులకు దర్శనమిస్తారు. పక్కనే ఉన్న నవగ్రహ ఆలయంలో భక్తులు శని త్రయోదశికి విశేష పూజలు చేస్తారు. ఆలయానికి కుడివైపుర సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి ఆలయంలో ప్రతి మంగళవారం భక్తులు పూజలు జరిపిస్తారు.

శివరాత్రికి ముస్తాబు..

మహా శివరాత్రి సందర్భంగా బుధవారం జిల్లా నలుమూల నుంచి భారీ సంఖ్యలో భక్తులు రాకను దృష్టిలో ఉంచుకొని ఆలయాన్ని ఆలయ కమిటీ నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయాన్ని విద్యుత్తు దీపాలతో అలంకరించారు. క్యూ లైన్లు ఏర్పాటు చేస్తున్నారు. భక్తులందరికీ శివుని దర్శన భాగ్యం కలిగేలా చర్యలు తీసుకున్నారు.



కైలాసగిరి క్షేత్రానికి వెళ్లేందుకు.. మెట్లదారి

సమష్టిగా పార్టీని మరింత బలోపేతం చేద్దాం

వైఎస్సార్ సీపీ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి


మాట్లాడుతున్న దొంతిరెడ్డి వేమారెడ్డి

మంగళగిరి టౌన్: సమష్టిగా పనిచేసి నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీని మరింత బలోపేతం చేద్దామని పార్టీ మంగళగిరి సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి అన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మంగళవారం నూతనంగా ఎన్నికైన వివిధ అనుబంధ విభాగాల నాయకులతో ఆయన సమావేశం నిర్వహించారు. రానున్న రోజుల్లో వైఎస్సార్ సీపీ ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటం చేస్తుందన్నారు. ప్రజలతో ప్రతి ఒక్క నాయకుడు, కార్యకర్త మమేకమై ప్రజా సమస్యలపై పోరాటమే లక్ష్యంగా పనిచేయాలని తెలిపారు. ఉపాధ్యాయుల సమస్యలపై నిరంతరం పోరాడే యూటీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావు గెలుపునకు పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ కోసం పనిచేసే వారికి ప్రత్యేకంగా గుర్తింపు ఉంటుందని, తమకు ఇచ్చిన పదవులు అలంకార ప్రాయంగా కాకుండా పార్టీ ఎదుగుదలకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి ఈదులమూడి డేవిడ్ రాజు, గుంటూరు జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు ఊట్ల పాలశ్రీనివాసరావు, జిల్లా యాక్టివిటీ కార్యదర్శి మల్లవరపు సుధారాణి, జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షుడు మేడా వెంకటేశ్వరరావు, జిల్లా అధికార ప్రతినిధి బాజీ గంగాధరరావు, మంగళగిరి పట్టణ రూరల్ అధ్యక్షుడు ఆకురాతి రాజేష్, నాళి వెంకట కృష్ణ, తాడేపల్లి మండల అధ్యక్షులు అమరా నాగయ్య, దుగ్గిరాల మండల అధ్యక్షుడు శివగోపయ్య, నాయకులు పాటిబండ్ల కృష్ణమూర్తి, 27 అనుబంధ విభాగాల అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మద్యం విక్రేతల అరెస్ట్

తాడికొండ: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న యడ్లపల్లి కోటేశ్వరరావు, బుర్రి రామారావులను మంగళవారం అదుపులోకి తీసుకుని, వారి నుంచి 120 క్వార్టర్ మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు తాడికొండ సీఐ కె.వాసు తెలిపారు. ఎస్‌ఐ జోజి మద్య విక్రయిస్తుండగా వారిని పట్టుకున్నట్లు తెలిపారు.

అంతర్జాతీయ స్కేటింగ్ పోటీలకు తాడేపల్లి కుర్రోడు

తాడేపల్లిరూరల్ : మార్చి 24 నుంచి 30 వరకు తైవాన్‌లో చైనీస్ తైపీ రోలర్ స్పోర్ట్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరుగనున్న అంతర్జాతీయ స్కేటింగ్ పోటీలకు భారతదేశం తరుపున గుంటూరు జిల్లా తాడేపల్లికి చెందిన కుర్రోడు ఎంపికయ్యాడు. ఈ మేరకు మంగళవారం ఫెడరేషన్ అధ్యక్షులు లీయు వు త్సాయ్ ఉత్తర్వులు పంపారు. తాడేపల్లి డోలాస్‌నగర్‌కు చెందిన మెరుగుపాల హాషిష్ అంతర్జాతీయ స్కేటింగ్ పోటీలకు ఎంపికైనట్లు కోచ్‌లు పి. సత్యనారాయణ, చిట్టిబాబు తెలిపారు. క్రీడాకారుడు హాషిష్‌ను ఎంపిక పట్ల ఏపీ రేలర్ స్కేటింగ్ అసోసియేషన్ కార్యదర్శి పి. థామస్, గుంటూరు రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు నీలిమ, శ్రీకాంత్‌లు హర్షం వ్యక్తం చేశారు.

చేతుల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

ఫిరంగిపురం: చేతులు పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా ఆరోగ్యం చేకూరుతుందని డాక్టర్ యానీ గ్రేస్ అన్నారు. మండలంలోని మునగపాడు గ్రామంలో మంగళవారం నుదురుపాడు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌లో భాగంగా వైద్య శిబిరం నిర్వహించారు. 98 మందికి బీపీ, షుగర్, థైరాయిడ్ పరీక్షలు చేసి, మందులు అందించారు. పాఠశాల విద్యార్థులకు ఎత్తు, బరువు, రక్త పూత పరీక్షలు చేశారు. డాక్టర్ యానీ గ్రేస్ మాట్లాడుతూ విద్యార్థులు భోజనానికి ముందు చేతులు పరిశుభ్రంగా కడుగుకోవాలని చెప్పారు. లేకుంటే నులి పురుగులు ఏర్పడి రక్త హీనత బారిన పడతారన్నారు. పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్ హెచ్‌పీ లింగరాజు, ఏఎన్ఎం పాపులమ్మ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

వక్ఫ్ బోర్డు అమెండ్‌మెంట్ బిల్లును తక్షణమే ఆపాలి

ముస్లిం సమైక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ సలావుద్దీన్


మాట్లాడుతున్న సయ్యద్ సలావుద్దీన్

తాడేపల్లిరూరల్ : వక్ఫ్ బోర్డు అమెండ్‌మెంట్ బిల్లును తక్షణమే ఆపాలని ముస్లిం సమైక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ సలావుద్దీన్ అన్నారు. మంగళవారం తాడేపల్లి ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం భారత రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాస్తూ, ముస్లిం సమాజాన్ని అన్ని రకాలుగా ఇబ్బంది పెడుతోందన్నారు. ఇప్పుడు వక్ఫ్‌బోర్డు అమెండ్‌మెంట్ బిల్లును అమలు చేయాలని చూస్తోందన్నారు. భారతదేశంలో మూడవ అతిపెద్ద భూ యజమానిగా వక్ఫ్ బోర్డు 9 లక్షల ఎకరాలకు పైగా కలిగి ఉందన్నారు. వక్ఫ్ అనగా దేవుని భూమి అని దీని మీద వచ్చే ఆదాయం పేద ముస్లిం వర్గాలను అభివృద్ధి చేసేందుకు వినియోగించాల్సి ఉంటుదని అన్నారు. అలాంటి వక్ఫ్ బోర్డును నిర్వీర్యం చేసి, సంస్థ ఆస్తులను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవడంలో భాగంగా ఈ వక్ఫ్ అమెండ్‌మెంట్ బిల్లును 42వ సవరణ ద్వారా లోక్‌సభలో ప్రవేశ పెట్టడానికి బిజెపి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. రాష్ట్ర గౌరవ సలహాదారు సర్దార్ ఖాన్, కోశాధికారి అబ్దుల్ కలాం, వైస్ ప్రెసిడెంట్ హాజీ సయ్యద్ మహబూబ్, మౌలా బేగ్, అబ్దుల్ అజీజ్, సయ్యద్ అబ్దుల్లా, షేక్ మహబూబ్ బాషా,నసీమా సుల్తానా పాల్గొన్నారు.

నా దేశానికి పంపండి..లేదా పౌరసత్వం ఇవ్వండి

– డిప్యూటీ సీఎం కార్యాలయం వద్ద యువకుడి నిరసన



మంగళగిరి టౌన్: దేశ పౌరసత్వం ఇవ్వండి లేదా.. తన దేశానికైనా పంపించండం అంటూ ఓ యువకుడు మంగళగిరి బైపాస్ రోడ్డులో ఉన్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కార్యాలయం వద్ద మంగళవారం దీక్ష చేపట్టాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఆ యువకుడ్ని మంగళగిరి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. యువకుడు జాయ్ మాట్లాడుతూ తాము శ్రీలంక ఫిషర్ బోర్డు సమీపంలో నివాసమున్నట్లు తెలిపాడు. ఆరేళ్ల వయసులో ఎల్‌టీటీఈ ఉద్యమం జరిగిందని, ఆ అల్లరిలో తప్పిపోయి షిప్‌లో భారతదేశంలోని నాగాలాండ్‌కు వచ్చానని తెలిపాడు. అప్పుడు ప్రభుత్వం ఏర్పాటు చేసిన క్యాంపులో ఉండకపోయే సరికి అరెస్ట్ చేసి, మద్రాస్ జువైనల్ హోమ్‌లో ఉంచారని చెప్పాడు. తనకు 16 ఏళ్లు నిండాక బయటకు వచ్చానని అన్నాడు. ఢిల్లీ హై కమిషన్‌లోని శ్రీలంక ఎంబసీని కూడా కలిసినట్లు తెలియజేశాడు. శ్రీలంక ఎంబసీ అధికారులు తన చిరునామా అడిగారని, తనకు గుర్తు లేదని చెప్పాని తెలిపాడు. అతనికి పోలీసులు నచ్చజెప్పే ప్రయత్నం చేయగా.. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వద్దకు పంపించాలని వేడుకొన్నాడు. డిప్యూటీ సీఎం అయితేనే నేరుగా ప్రధాని మోదీతో మాట్లాడే అవకాశం ఉందని.. తనకు వేరే దారి లేదంటూ బోరుమన్నాడు. తనకు సంబంధించిన కొన్ని పత్రాలు చెన్నైలో ఉన్నాయని చెప్పడంతో.. మంగళగిరి పట్టణ పోలీసులు చార్జీలు ఇచ్చి జాయ్‌ను చెన్నైకు పంపించారు.

ఓం నమఃశివాయ


విరాజిల్లుతున్న శైవక్షేత్రం



మంగళగిరి టౌన్: మంగళగిరి నియోజకవర్గంలోని శైవక్షేత్రాలు మహా శివరాత్రి వేడుకలకు ముస్తాబయ్యాయి. గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి ఆలయ, పాత మంగళగిరిలోని శివాలయం విద్యుత్ కాంతులు విరజిమ్ముతున్నాయి. ఆలయం లోపల వివిధ రకాల పుష్పాలతో సుందరంగా అలంకరించారు. భక్తులు రాక మేరకు ప్రత్యేక క్యూ లైన్లు ఏర్పాటు చేశారు.

తాడేపల్లిరూరల్: మహా శివరాత్రి శివాలయాలను నిర్వాహకులు ముస్తాబు చేశారు. కృష్ణాతీరంలోని దేవాదాయ శాఖ సోమేశ్వర ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. బుధవారం శివరాత్రికి ప్రత్యేక పూజలు చేయనున్నారు. తాడేపల్లి వారధి, బొమ్మల మండపం, పట్టణ, రూరల్ పరిధిలో దేవాలయాలను విద్యుద్దీపాలతో అలంకరించారు. సీతానగరం పుష్కర ఘాట్‌కు పుణ్య స్నానాలు ఆచరించేందుకు వేలాదిగా భక్తులు వస్తారు. మంగళవారం సాయంత్రం 6 గంటల వరకు కూడా అధికారులు పూర్తి స్థాయిలో అక్కడ ఏర్పాట్లు చేయలేదు. నాలుగు బాత్‌రూమ్‌లు ఏర్పాటు చేశారు. మహిళా దుస్తులు మార్చుకునేందుకు సౌకర్యాలు కల్పించలేదు. కార్పొరేషన్ సిబ్బంది మాత్రం తెల్లవారుజామున కల్లా ఏర్పాట్లన్నీ పూర్తవుతాయని ధీమా వ్యక్తం చేస్తున్నారు.

పొగడ వృక్ష వాహనంపై మల్లేశ్వరుని గ్రామోత్సవం



మంగళగిరి టౌన్ : మంగళగిరినగరంలోని గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామివారు పొగడవృక్ష వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఆయా కూడళ్లలో భక్తులు స్వామివారిని దర్శించుకుని టెంకాయలు సమర్పించి హారతులు ఇచ్చారు. దేవస్థానం నుంచి ప్రారంభమైన స్వామి గ్రామోత్సవం మెయిన్ బజార్ మీదుగా పూల మార్కెట్, మిద్దె సెంటర్‌కు చేరింది. అక్కడి నుండి కోనేరు మీదుగా తిరిగి దేవస్థానానికి చేరుకుంది. ఉత్సవానికి పట్టణానికి చెందిన ప్రసన్న కోటేశ్వరరావు, అనిత దంపతులు కైంకర్యపరులుగా వ్యవహరించారు. మహిళా భక్తులు కోలాట కార్యక్రమం నిర్వహించారు. ఈవో జేవీ నారాయణ ఉత్సవ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

సంక్షిప్త వార్తలు

■ ముగిసిన అంగన్‌వాడీల శిక్షణ
దుగ్గిరాల: మండల కేంద్రంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ఆరు రోజులుగా పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న అంగన్‌వాడీ శిక్షణ కార్యక్రమాలు మంగళవారంతో ముగిశాయి. కార్యక్రమంలో బోధన పద్ధతులు గురించి, ప్రాజెక్టుల తయారీ గురించి శిక్షణ ఇవ్వడం జరిగింది. సూపర్‌వైజర్ ఎస్.భవానీ, ఆర్పీ రబ్బానీ, కిషోర్ కార్యక్రమంలో పాల్గొన్నారు. అంగన్‌వాడీ టీచర్స్ తయారు చేసిన ప్రాజెక్టులను ప్రదర్శించారు.

■ శివాలయం పేరుతో విరాళాలు సేకరిస్తే చర్యలు
మంగళగిరి టౌన్ : మంగళగిరి గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి దేవస్థానం పేరు చెప్పి విరాళాలు, చందాలు వసూలు చేసేవారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని దేవస్థాన కార్యనిర్వహణాధికారి జిడుగు వెంకట నారాయణ హెచ్చరించారు. దేవస్థానంలో బయటి వ్యక్తులు, సంస్థలు నిర్వహిస్తున్న అన్నదానాలు, సామూహిక పూజలపై భక్తుల నుంచి వస్తున్న విమర్శల నేపథ్యంలో అధికారులు ఆలయ ప్రాంగణంలో మంగళవారం నియమనిబంధనలతో కూడిన ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన ట్రస్ట్ బోర్డు మాజీ చైర్మన్ బోగి కోటేశ్వరరావు, సీతారామ కోవెల మాజీ ట్రస్ట్ బోర్డు చైర్మన్ వాకా మంగారావు పాల్గొన్నారు.

■ లక్ష్మణరావును గెలిపించుకుందాం
తాడేపల్లిరూరల్ : కృష్ణ, గుంటూరు ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావు విజయాన్ని కాంక్షిస్తూ మంగళవారం ఎంటీఎంసీ పరిధిలోని కొలనుకొండలో ప్రజా సంఘాల నాయకులు విస్తృత ప్రచారం నిర్వహించారు. సీఐటీయూ తాడేపల్లి మండల నాయకులు దొంతిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ 18 ఏళ్లుగా ఉపాధ్యాయులు, ఉద్యోగులు, పెన్షనర్లు, ఔట్ సోర్సింగ్ కాంట్రాక్ట్ కార్మికులు, అంగన్‌వాడీ, ఆశా వర్కర్ల సమస్యలపైనే కాక రైతులు, కౌలు రైతులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై శాసనమండలిలో ప్రజా గొంతుకై పోరాటం చేసిన కేఎస్ లక్ష్మణరావును గెలిపించాలని అభ్యర్థించారు. గురువారం జరిగే పోలింగ్‌లో లక్ష్మణరావుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించుకోవాలని కోరారు. వివిధ సంఘాల నాయకులు పల్లె కృష్ణ, విజయరాజు, కాజా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

■ మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి
మంగళగిరి టౌన్: మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి అన్నవరపు ప్రభాకర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ధర్నాల్లో భాగంగా మంగళవారం ఎంటీఎంసీ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ప్రభాకర్ మాట్లాడుతూ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జనాభా ప్రాతిపదికన కార్మికులను పెంచాలని, ఆప్కాస్ అమలు జరపాలని కోరారు. మునిసిపాలిటీ ద్వారానే కార్మికులకు వేతనాలు ఇవ్వాలని డిమాండ్‌చేశారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గండికోట దుర్గారావు, ఏఐటీయూసీ కార్యదర్శి చిన్ని సత్యనారాయణ, హరిబాబు, రాయుడు, బాపనపల్లి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

■ విద్యార్థుల అభ్యాసన అంచనాలకు అనుగుణంగా విద్యా బోధన
తెనాలిటౌన్: విద్యార్థుల అభ్యాసన అంచనాలకు అనుగుణంగా బోధించాలని అంగన్‌వాడీ టీచర్లకు ఎంఈవో జయంతిబాబు సూచించారు. జ్ఞానజ్యోతి, స్పెల్ టు 120 రోజుల సర్టిఫికెట్ మొదటి సంవత్సరం శిక్షణ కోర్సు కార్యక్రమంలో భాగంగా చివరి రోజు మంగళవారం మారీసుపేటలోని ఎన్‌సీఆర్ హైస్కూల్‌లో అంగన్‌వాడీలకు శిక్షణ ఇచ్చారు. ఎంఈవో పాల్గొని అంగన్‌వాడీలకు పలు సూచనలు చేశారు. పిల్లల ఆరోగ్యం, పోషకాహారం, పరిశుభ్రత దృష్టిలో పెట్టుకుని బాలల సంక్షేమం, అభివృద్ధి, అభ్యాసన ఉండాలని తెలిపారు. అనంతరం శిక్షణ సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో డాక్టర్ ఎం.సునీత, డీఆర్‌పీలు కె.సౌజన్య, శ్రీ రామరాజు, సీఆర్‌ఎంటీలు శ్రీదేవి, దీపాంజలి పాల్గొన్నారు.

■ సచివాలయాలకు శానిటేషన్ టబ్బులు
తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని ప్రతి సచివాలయానికి శానిటేషన్ టబ్బులతో పాటు ఇతర సామగ్రిని కార్పొరేషన్ నుంచి మంగళవారం అందజేశారు. తాడేపల్లి పట్టణ పరిధిలో రూరల్ పరిధిలో మొత్తం 20 సచివాలయాలు ఉండగా ఒక్కో సచివాలయానికి పది టబ్‌ల చొప్పున అందజేశారు. సిబ్బందికి అవసరమైన గ్లౌజ్‌లు, ఇతర శానిటేషన్ సామాన్లు సచివాలయాల వారీగా అందజేశారు.

■ విద్యార్థులకు కళ్లజోళ్లు పంపిణీ
దుగ్గిరాల: మండల పరిధిలోని ఉన్నత పాఠశాలల్లో 34 మంది విద్యార్థులకు మంగళవారం వైద్యాధికారులు కళ్లజోళ్లు పంపిణీ చేశారు. స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఇజాబ్ అబ్దుల్ రెహమాన్, రేవేంద్రపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో డాక్టర్ ఇందిరా విద్యార్థులకు కళ్లజోళ్లు పంపిణీ చేశారు. ఆప్తామాలజిస్ట్ వినోద్‌బాబు మాట్లాడుతూ.. గతేడాది విద్యార్థులకు కంటి స్క్రీనింగ్ నిర్వహించి, దృష్టి లోపం ఉన్న విద్యార్థులను గుర్తించడం జరిగిన్నారు. హెల్త్ ఎడ్యుకేటర్ వి.సుబ్బారావు, ఎంఎల్‌హెచ్‌పీ వి.బుజ్జి, వెంకటేష్, హెల్త్ సూపర్‌వైజర్ మహ్మద్ కాజా, హెడ్‌మాస్టర్ ఎస్.శోభాదేవి, బాలసుందరం ఉన్నారు.

■ ముమ్మరంగా ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం
దుగ్గిరాల: మండల కేంద్రంలో ఎమ్మెల్సీ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావు తరపున మంగళవారం ఎన్నికల ప్రచారం ముమ్మరంగా నిర్వహించారు. పట్టభద్రుల ఓటర్లను కలిసి పీడీఎఫ్ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావుకు వేసి, గెలిపించాలని అభ్యర్థించారు. మాంటిస్సోరి ఇంగ్లీషు మీడియం స్కూల్‌లోని టీచర్స్‌ను, కేఆర్ఎం డీగ్రీ కళాశాల అధ్యాపకులకు కరపత్రాలు అందజేశారు. కార్మిక నాయకుడు జెట్టి బాలరాజు, చిరంజీవి, శేషగిరి, స్టాలిన్, వై.బ్రహ్మేశ్వరరావు, అమ్మిరెడ్డి పాల్గొన్నారు.